అగస్టు 16, 2002

**డిబిఒడి. ఎఎమ్ఎల్.బిసి.18/14.01.001/2002-03**

**అన్ని వాణిజ్య బ్యాంకుల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లకు**

**మహాశయా,**

**"మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి" నియమాలకూ "నగదు లావాదేవీల"కూ సంబంధించిన మార్గదర్శక సూత్రాలు**

"మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి" (కెవైసి) నియమంలో భాగంగా, డిపాజిట్‌దారుల గుర్తింపుకు సంబంధించి ఆర్‌బిఐ, అనేక మార్గదర్శక సూత్రాలను జారీచేసింది. ఆర్థిక పరమైన మోసాలను నియంత్రించడానికీ ద్రవ్య స్వభావ మార్పిడిని, అనుమానాస్పద కార్యకలాపాలనూ గుర్తించడానికీ అధిక విలువగల నగదు లావాదేవీలను (స్క్రూటినీ చేయడానికీ) పరివీక్షించడానికీ సహాయపడే రీతిలో వ్యవస్థలనూ విధానాలనూ ఏర్పరుచుకోమని బ్యాంకులకు సలహా ఇవ్వడమైంది. మోసాలు చేయడానికి బ్యాంకింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేయడాన్ని నివారించడానికి కొత్త ఖాతాదారులకోసం ఖాతాలు తెరుస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండమని బ్యాంకులకు సలహాలిస్తూ ఎప్పటికప్పుడు ఆర్‌బిఐ, సూచనలుకూడా జారీచేసింది. పైన సూచించిన విషయాలకు సంబంధించి గతంలో జారీ చేసిన సర్క్యులర్‌ల సారాంశాన్ని అనుబంధంలో చూపడమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలోని ఇటీవలి పరిణామాలను పరిగణనలోకి తీసుకొని, కెవైసి నియమాలు, నగదు లావాదేవీలకు సంబంధించి ప్రస్తుతమున్న సూచనలను పునరుద్ఘాటించాలనీ సంఘటితం చేయాలనీ నిర్ణయించడమైంది. నేరపూరితమైన కార్యకలాపం ద్వారా సంపాదించిన నిధులు బదిలీకి లేదా డిపాజిట్‌కు, డిపాజిట్ ఖాతా మరియు అప్పు ఖాతాల రెండింటి విషయంలో లేదా ఉగ్రవాదానికి ఆర్థిక సహాయం అందించడానికి బ్యాంకులను వివేచనారహితంగా ఉపయోగించుకోడాన్ని నివారించి, బ్యాంకులకు రక్షణ కల్పించే దృష్టితో ఈ విషయంమీద గతంలో ఇచ్చిన సూచనలకు కింది మార్గదర్శక సూత్రాలు మరింత బలం చేకూరుస్తాయి. ఈ మార్గదర్శక సూత్రాలు, విదేశీ కరెన్సీ ఖాతాలకు/లావాదేవీలకు కూడ వర్తిస్తాయి.

2. కొత్త ఖాతాలకు **"మీ ఖాతాదారుగురించి తెలుసుకోండి"** (కెవైసి) మార్గదర్శక సూత్రాలు.

కింది కెవైసి మార్గదర్శక సూత్రాలు, కొత్త ఖాతాలున్నప్పటికీ తక్షణం వర్తిస్తాయి.

**2.1. కెవైసి విధానం**

1) ఖాతా తెరిచే వ్యక్తిని కార్పొరేట్‌ను గుర్తించడానికి "మీ ఖాతాదారు గురించి

తెలుసుకోండి” (కెవైసి) విధానం కీలకమైన నియమంగా ఉంటుంది. ఖాతాదారు గుర్తింపులో, వర్తమాన ఖాతాదారు/బ్యాంకుకు తెలిసిన వ్యక్తి నుంచి పరిచయ పూర్వకమైన రెఫరెన్స్ ద్వారా లేదా ఖాతాదారు సమకూర్చిన పత్రాల ప్రాతిపదిక మీద పరిశీలించడం జరుగుతుంది.

2) ఖాతా తెరిచే వ్యక్తుల కార్పొరేట్‌లకు సంబంధించి న్యాయసమ్మతమైన గుర్తింపును పరిశీలించే పద్ధతులు ఏర్పాటు చేయడానికి బ్యాంకుల పాలకమండలికి తగిన విధానాలు ఉండాలి. ఖాతాలలో అనుమానాస్పద స్వభావం ఉన్న లావాదేవీలను పరివీక్షించడానికి తగిన ప్రక్రియలు, కార్యవిధానాలను ఏర్పాటు చేసేవిధానాలు పాలకమండలికి ఉండాలి. అలాంటి లావాదేవీలను జాగ్రత్తతో పరిశీలించి, నివేదించే వ్యవస్థలు ఉండాలి.

**2.2. ఖాతాదారు గుర్తింపు**

కెవైసి కార్యచట్రానికి సంబంధించి ప్రధానంగా రెండు లక్ష్యాలున్నాయి. అవిః (i) సముచితమైన ఖాతాదారు గుర్తింపు విధానాన్ని ఏర్పాటు చేయడంః (ii) అనుమానాస్పద స్వభావం ఉన్న లావాదేవీలను పర్యవేక్షించడం. ప్రధానంగా, ఖాతాదారులు స్వయంగా వెల్లడించే అంశాల ఆధారంగా, ఒక్కొ కొత్తఖాతాదారు గుర్తింపును/ న్యాయ సమ్మతమైన ఉనికినీ ఋజువు చేయడానికి అవసరమైన సమాచారాన్నంతా బ్యాంకులు సేకరించాలి. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు మొదలైన పత్రాలు గుర్తింపును ఋజువు చేసుకోడానికి సులభమైన సాధనాలుగా ఉంటాయి. అయితే అలాంటి పత్రాలు అందుబాటులో లేనట్లయితే వర్తమాన ఖాతాదారుల ద్వారా నిరూపణ చేసుకోవడం లేదా బ్యాంకుకు తెలిసిన వ్యక్తి పరిచయం చేయడం సరిపోతుంది. దీనికి అవలంబించే విధానం సాధారణ ప్రజానీకానికి బ్యాకింగ్ సేవలు అందకుండా చేసేదిగా ఉండకుండా/లేకుండా చూసుకోవాలి.

(2) ఈ సందర్భంలో మీ మార్గదర్శకత్వం కోసం ఐబిఎ ఏర్పటుచేసిన కార్యనిర్వాహకవర్గం భారతదేశంలోని బ్యాంకులకు రూపొందించిన “మనీ లాండరింగ్ వ్యతిరేక మార్గదర్శకాల” నివేదికను కూడా చూడమని కోరుతున్నాం. మనీ లాండరింగ్ వ్యతిరేకతపై ప్రాధాన్యంతో కెవైసిని పటిష్ఠం చేయడంకోసం ఐబిఎ కార్యనిర్వాహకవర్గం అనేక సిఫార్సులు చేయడం మనం గమనించవచ్చు. ఖాతాదారు ప్రొఫైల్‌కు ఖాతా తెరవడానికి సంబంధించిన విధానాలకు ఫార్మేట్‌లను కూడా సూచించడమైంది. కొన్ని నిర్దిష్టమైన వర్గాల ఖాతాదార్లతో సంబంధం పెట్టుకోవడం వంటి అంశాలకు సంబంధించి కూడా సూచనలిచ్చారు. అనుమానాస్పద కార్యకలాపాలకు సంబంధించి ఉదాహరణపూర్వక జాబితానుకూడా సమకూర్చడమైంది.

**3. ప్రస్తుతమున్న ఖాతాదారులకు "మీ ఖాతాదారుల గురించి తెలుసుకోండి" కార్యవిధానాలు**

అనుబంధంలో చూపిన ప్రస్తుతం అమలులో ఉన్న సూచనల ప్రకారం ప్రస్తుతమున్న ఖాతాదారులకు సంబంధించి వారు ఖాతాలను తెరిచే సమయంలో బ్యాంకులు తగిన జాగ్రత్తతో సముచితమైన కెవైసి నియమాలను అవలంబించి ఉంటాయని భావించడమైంది. అయితే ఏదైనా నియమాన్ని పాటించనట్లయితే ఖాతాదారు గుర్తింపుకు సంబంధించి పాటించవలసిన అట్టి కెవైసి నియమాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయవలసి ఉంటుంది.

**4. నగదు లావాదేవీల గరిష్ఠ పరిమితి, పరివీక్షణ**

ఈ విషయానికి సంబంధించి ప్రస్తుతమున్న ఆర్‌బిఐ మార్గదర్శక సూత్రాలు కింది విధంగా ఉన్నాయి.

(1) బ్యాంకులు 50వేల రూపాయలు అంతకు మించిన ట్రావెలర్స్ చెక్కులను డిమాండ్ డ్రాఫ్టలను మెయిల్ బదిలీలను మరియు టెలిగ్రాఫర్ బదిలీలను ఖాతాదారుల ఖాతాలకు డెబిట్ చేయడం లేదా చెక్కుల ద్వారా మాత్రమే జారీచేయాలికానీ నగదు తీసుకొని కాదు (సర్క్యులర్ డిబిఏడి. బిపి. బిసి 114/సి. 469 (81)-91 తేదీ ఏప్రిల్ 19, 1991). అంతేకాకుండా, దరఖాస్తుదారులు (ఖాతాదారులు అయినా కాకపోయినా) రూ.10,000/-లకు మించిన మొత్తానికి పైన పేర్కొన్న లావాదేవీల నిమిత్తం దరఖాస్తుల మీద శాశ్వత (ఆదాయపు పన్ను) ఖాతా సంఖ్య వేయాలి (సర్క్యులర్ డిబిఒడి.బిపి.బిసి. 92/సి 469-76 తేది ఆగస్టు 12, 1976). ప్రస్తుతం కెవైసి ఖాతాదారు గుర్తింపును రుజువు చేసుకోవలసి ఉన్నందున రూ.50,000/-లు, అంతకు మించిన మొత్తాలకు ఖాతాకు డెబిట్ చేయడం ద్వారా డిమాండ్ డ్రాఫ్ట్ మొదలైనవి జారీ చేయవలసి ఉన్నందున పాన్ (PAN) వివరాలను అందించడానికి కనీస విలువల్ని ఏకరూపంగా రూ.50,000/- లకు పెంచడమైంది.

(2) బ్యాంకులు నగదు ఉపసంహరణలు మరియు డిపాజిట్‌ల విషయంలో ఖాతాలో పది లక్షల రూపాయలు , అంతకు మించిన మొత్తం డిపాజిట్లను నగదు క్రెడిట్ లేదా ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాలను సన్నిహితంగా గమనిస్తూ పెద్ద ఎత్తున జరిగే నగదు లావాదేవీలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తూ ఉండాలి (సర్క్యులర్ డిబిఒడి. బిపి. బిసి. 57/21.01.001/95 తేది మే 4, 1995)

(3) బ్యాంకుల శాఖలు, రూ. 10 లక్షలు, అంతకు మించిన అన్ని నగదు డిపాజిట్లనూ ఉపసంహరణలనూ అనుమానాస్పదమైన స్వభావం ఉన్న లావాదేవీలను కూడా పూర్తి వివరాలతో, తమ పక్షంవారీ స్టేట్‌మెంట్లతో తమ నియంత్రణ కార్యాలయాలకు

నివేదించాలి. నియంత్రణ కార్యాలయాలు కూడా అలాంటి అనుమానాస్పద స్వభావం ఉన్న లావాదేవీలకు సంబంధించి, తమ కేంద్ర కార్యాలయాలకు తెలియ చేయాలి (సర్క్యులర్ డిబిఒడి. బిపి. బిసి. 101/21.01.001/95 తేది సెప్టెంబర్ 20, 1995). నివేదించే శాఖను త్వరగా కంప్యూటరీకరించడంవల్ల అలాంటి నివేదికలు సత్వర జారీకి అవకాశం ఏర్పడుతుంది.

**5. నష్టపూచీ నిర్వహణ, పరివీక్షణ కార్యవిధానాలు**

బ్యాంకింగ్ ఛానెళ్లను న్యాయసమ్మతంకాని, జాతీయ వ్యతిరేక కార్యకలాపాలకు దుర్వినియోగం చేసే అవకాశాన్ని నిరోధించడానికి బోర్డు, కింది అంశాలతోకూడిన ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి.

**5.1. అంతర్గత నియంత్రణ వ్యవస్థలు**

విధాన నిర్ణయాలనూ, కార్యవిధానాలనూ సమర్థంగా నిర్వహించడానికి భావి మరియు ప్రస్తుతమున్న బ్యాంకు డిపాజిట్ ఖాతాలకు సంబంధించి సమర్థమైన కెవైసి కార్యక్రమాలపట్ల పూర్తి నిబద్ధత, ఆచరణ ఉండటానికి వీలుగా విధులను, బాధ్యతలను స్పష్టంగా అప్పగించాలి. బ్యాంకుల నియంత్రణ కార్యాలయాల నియతకాలికంగా, శాఖా స్థాయిలోని అధికారులు తీసుకొన్న విధాన నిర్ణయాలనూ, కార్య విధానాలనూ కచ్చితంగా పాటిస్తున్నారో లేదో పరివేక్షిస్తూ ఉండాలి.

**5.2. ఉగ్రవాదానికి ఆర్థిక సహాయం**

ఉగ్రవాద సంస్థలతో ఏదైనా లావాదేవీని బ్యాంకులు కనిపెట్టి తగిన జాగ్రత్తలు తీసుకోడానికి వీలుగా భారత ప్రభుత్వం ప్రకటించిన ఉగ్రవాద సంస్థల జాబితాను ఆర్‌బిఐ, బ్యాంకులకు సర్క్యులేట్ చేస్తోంది. భావి లేదా ప్రస్తుత వ్యాపారంతో సంబంధమున్న వ్యక్తి కాని / సంస్థ కానీ, అలాంటి జాబితాలో ఉన్నాడో/ఉందో నిర్ధారించడానికై, అట్టి జాబితాలను పరిశీలించడానికి వీలుగా శాఖ స్థాయిలో ఒక వ్యవస్థ ఉండాలి. ఉగ్రవాద సంస్థలకు వ్యక్తులకు చెందినవిగా అనుమానించిన ఖాతాల గురించి బ్యాంకుల నుంచి నివేదికలను గ్రహించే అధికారి వివరాలను ప్రభుత్వంతో సంప్రదించిన అనంతరం సూచిస్తారు.

**5.3. అంతర్గత ఆడిట్ / తనిఖీ**

(i) బ్యాంకులలోని అంతర్గత ఆడిట్ ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికమీద అధిక విలువగల లావాదేవీల గుర్తింపుకు సంబంధించి ఒక స్వతంత్రమైన నియంత్రణల మూల్యాంకనం ఉండాలి.

(ii) ఉమ్మడి-అంతర్గత ఆడిటర్లు, కెవైసి నియమాలను పాటించడంలో మనీ లాండరింగ్

నివారణ దిశలోనూ శాఖలు తీసుకొన్నచర్యల ప్రభావాన్ని ప్రత్యేకంగా పరిశీలించి వ్యాఖ్యానించవలసి ఉంటుంది. అలాంటి పాటింపు నివేదికను త్రైమాసిక విరామాలలో బ్యాంకుల బోర్డుకు చెందిన ఆడిట్ కమిటీ ముందుంచాలి. దీన్ని సర్క్యులర్ డిబిఒడి. నెం బిపి. బిసి. 3/21.03.038/2000 తేది జూలై 14, 2000లో సూచించిన సమీక్షల క్యాలండర్‌లో చేర్చవచ్చు.

**5.4. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడం మరియు నివేదించడం**

అనుమానాస్పద స్వభావం ఉన్న లావాదేవీలను శాఖలు మరియు నియంత్రణ కార్యాలయాలు, అలాంటి కార్యకలాపాలకు వర్తించే చట్టాల పరిధిలో నియమించిన శాసనం అమలు అధికారులకు నివేదించేటట్లు బ్యాంకులు చూడాలి. అలాంటి అధికారులు ఆదేశించినట్లుగా ఖాతాలను స్తంభింపచేయడానికీ, ఆ విషయాన్ని నియంత్రణ కార్యాలయానికీ, కేంద్ర కార్యాలయానికీ నివేదించడానికి తగిన విధానాలను రూపొందించాలి. ఇవి సున్నిత స్వభావం ఉన్న విషయాలు కాబట్టి, అలాంటి విషయాలను మూడు మాసాలకొకసారి బోర్డు ఆడిట్ కమిటీకి లేదా డైరెక్టర్‌ల బోర్డుకు నివేదించాలి.

**5.5. విదేశీ విరాళాల రెగ్యులేషన్ చట్టం (ఎఫ్‌సిఆర్ఎ), 1976 అనుసరణ**

(i) విదేశీ విరాళాల రెగ్యులేషన్ చట్టం, 1976 పరిధిలో భారత ప్రభుత్వంచే నమోదు చేయబడిన సంఘాల పేరిట మాత్రమే ఖాతాలు తెరవాలనీ లేదా చెక్కులు వసూలు చేయాలనీ బ్యాంకులను హెచ్చరించే నిబంధనలకు సంబంధించిన ఉత్తర్వులను బ్యాంకులు అనుసరించాలి. ఖాతా తెరిచే సమయంలో లేదా చెక్కుల వసూలు సమయంలో ఆ సంఘం, భారత ప్రభుత్వ చట్టం పరిధిలో రిజిస్టర్ అయిందని తెలిపే ధృవపత్రాన్ని సంబంధిత సంఘం నుంచి గ్రహించాలి.

(ii) నిషిద్ధ సంస్థల పేరుతోనూ ఆవశ్యకమైన రిజిస్ట్రేషన్ లేని సంస్థల పేరుతోనూ ఖాతాలు తెరవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బ్యాంకుల శాఖలకు సలహా ఇవ్వడమైంది.

**6. రికార్డుల నిర్వహణ**

తమ ద్వారా జరిగిన ఏదైనా లావాదేవీని పునర్నిర్మించడానికి వీలుగా సుసంగతమైన చట్టాలను నిబంధనలోని ఆవశ్యకతలకు తగినట్లు తమకు ఖాతాదారులకు మధ్య ఉన్న సంబంధాలను తెలియచేసే డాక్యుమెంటేషన్‌ను ఆర్థిక మధ్యవర్తిత్వ సంస్థలు రూపొందించి, నిర్వహించాలి. వైర్‌బదిలీ లావాదేవీల విషయంలో ఎలక్ట్రానిక్ చెల్లింపుల సందేశాల రికార్డులను ఖాతాలోని ఎంట్రీలకు మద్దతుగా ఇతర రికార్డుల రీతిలోనే పరిగణించాలి. ఆర్థిక లావాదేవీల

రికార్డులన్నిటినీ లావాదేవీలు జరిగిన తరవాత కనీసం 5 సం॥రాలపాటు అట్టిపెట్టి ఆడిట్ నిర్వాహకులకు అవసరమైనప్పుడు రెగ్యులేటర్‌లకు కూడా పరిశీలన నిమిత్తం అందుబాటులో ఉంచాలి.

**7. సిబ్బంది శిక్షణ-యాజమాన్యం**

నిర్వాహక మరియు యాజమాన్య సిబ్బంది మొత్తం కెవైసి నియమాలను కచ్చితంగా అనుసరించవలసిన అవసరాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవడం ఎంతైనా కీలకమైన అంశం. అందువల్ల మనీ లాండరింగ్ వ్యతిరేక మార్గదర్శక సూత్రాలను పాటించడంలో ఆయా క్రమశ్రేణి స్థాయికి ఉచితమైన బాధ్యతలనూ గ్రహించడానికీ నిరంతరం కెవైసి నియమాలను అమలుచేయడానికీ నిరంతర శిక్షణ కార్యక్రమాన్ని సంస్థలన్నీ నిర్వహించాలి.

8. ఈ మార్గదర్శక సూత్రాలను, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949 సెక్షన్ 35 (ఎ) పరిధిలో జారీ చేయడమైంది. వీటిని ఉల్లంగించినట్లయితే చట్టంలోని సంబంధిత నిబంధనలకింద జరిమానాలకు పాత్రులవుతారు. ఈ మార్గదర్శక సూత్రాలను తమ శాఖలు మరియు నియంత్రణ కార్యాలయాల దృష్టికి తీసుకు వెళ్ళమని బ్యాంకులకు సలహా ఇవ్వడమైంది.

9. సర్క్యులర్‌లో పొందుపరచిన వివిధ మార్గదర్శక సూత్రాలను పాటించడానికి తీసుకొన్న చర్యల గురించి ఈ సర్క్యులర్ అందిన తేదీనుంచి ఒక నెలలోపల చీఫ్ జనరల్ మేనేజర్, మనీ లాండరింగ్ వ్యతిరేక, బ్యాంకింగ్ కార్యకలాపాలు మరియు అభివృద్ధి విభాగము, భారతీయ రిజర్వ్ బ్యాంకు, కేంద్ర కార్యాలయం, సెంటర్ 1, వరల్డ్ ట్రేడ్ సెంటర్, కఫె పారేడ్, ముంబాయి-400 005కు తెలియజేయాలి. సర్క్యులర్‌లోని ఉత్తర్వుల అమలును ఆరు నెలల తరవాత బ్యాంకర్లతో జరిగే సమావేశాలలో ఆర్‌బిఐ సమీక్షించి, ఆ తరవాత మాస్టర్ సర్క్యులర్ జారీ చేయడం గురించి పరిశీలిస్తుంది.

10. ఇది ముట్టినట్లు తెలియజేయండి.

మీ విధేయుడు

(సి.ఆర్.మురళీధరన్)

చీఫ్ జనరల్ మేనేజర్